క్లుప్తంగా

బాసరలో రక్తదాన శిబిరం

భైంసాటౌన్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం బాసరలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు దేవస్థాన ఆవరణలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. ఆలయ ఏఈవో, అర్చకులు, వాగ్దేవి సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ సంయుక్త సమ్మేళనం

భైంసాటౌన్: బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా బుధవారం వివిధ మోర్చాల సంయుక్త సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా అధ్యక్షురాలు రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ, ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి స్వామి యాదవ్ హాజరయ్యారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు దడిగె భోజన్న, నాగనాథ్, పోశెట్టి, వెంకటేశ్ తదితరులున్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు భూమన్నయాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కృష్ణ, ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, సుదర్శన్, నర్సయ్య, రమేశ్, సుజాతదేవి తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



షేక్ మొయిన్

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీకి చెందిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు మాలన్‌సుల్తానా భర్త బీఆర్‌ఎస్ నాయకుడు షేక్ మొయిన్(60) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. మధ్యాహ్నం అస్వస్థతకు గురవడంతో కుటుంబీకులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు.

‘బీజేపీని బలోపేతం చేయాలి’

లోకేశ్వరం: బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు పవర్ రామారావ్ పటేల్ అన్నారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులవగా బుధవారం ఆయనను మండల కేంద్రంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జయసాగర్‌రావు, బీజేవైఎం మండల అధ్యక్షుడు అనిల్, భాస్కర్, విలాస్, శ్రీనివాస్, గణేశ్, హరీశ్ తదితరులు ఉన్నారు.

బాలింతలకు పండ్లు పంపిణీ

సర్సాపూర్(జి): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైద్య ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని 30 పడకల సామాజిక ఆసుపత్రిలో బాలింతలకు కేసీఆర్ కిట్లు, పండ్లను సర్పంచ్ రాంరెడ్డి, జెడ్పీటీసీ చిన్న రామయ్య అందజేశారు. కార్యక్రమంలో కొండ్ర రమేష్, ఆయిటి మహేశ్, మహేందర్, బర్కుంట సాగర్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి సాయం

కడెం: మండలంలోని చిట్యాల్ గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం బీఆర్‌ఎస్ నాయకుడు భుక్యా జాన్సన్‌నాయక్ పర్యటించారు. గొండుగూడ గ్రామంలో పేద కుటుంబానికి చెందిన పెంద్రం నాగుబాయి వివాహానికి రూ.ఐదు వేల సాయం అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీకాంత్‌యాదవ్, దివ్య, రాజేశ్వర్‌గౌడ్, ఆర్క మధు, శేఖర్ తదితరులు ఉన్నారు.

కిసాన్‌సెల్ జిల్లా చైర్మన్‌గా రమేశ్



నియామక పత్రం అందుకుంటున్న రమేశ్

కడెం: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ విభాగం జిల్లా చైర్మన్‌గా మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన బరుపటి రమేశ్ నియమితులయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు సతీశ్‌రెడ్డి ఉన్నారు.

షీ టీం సేవలపై అవగాహన

సోన్: వేధింపులకు గురైతే ఆందోళన చెందకుండా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని ఎస్సై సుమాంజలి అన్నారు. బుధవారం మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులకు షీటీం సేవలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. షీ టీం సభ్యులు రమ, రమాదేవి సూర్యభాను, ప్రిన్సిపాల్ సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో బస్‌షెల్టర్లు

- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- అపరిశుభ్రంగా పరిసరాలు
- పట్టించుకోని అధికారులు



లోకేశ్వరం పాతబస్టాండ్‌లో వాహనాల పార్కింగ్



భైంసా మండలం వాలేగాంలో శిథిలావస్థకు చేరిన బస్‌షెల్టర్

లోకేశ్వరం: ప్రయాణికుల సౌకర్యార్థం గ్రామాల్లో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌లు పలు చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల కూలేలా ఉన్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కూర్చొనేందుకు సరైన బల్లలు ఉండటం లేదు. కుక్కలు, పందులు, మందుబాబులు, యాచకులకు నిలయాలుగా మారాయి. మరోవైపు నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో పరిసరాలు కూడా అధ్వానంగా మారాయి. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతాయి. పరిస్థితి ఇలానే ఉంటే వర్షాకాలంలోనూ బస్సుల్లో ప్రయాణం సాగించే విద్యార్థులు, ఇతరులకు ఇబ్బందులు తప్పవు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామాల్లోని బస్టాండ్ల వద్ద మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు వేడుకుంటున్నారు.

రాయపూర్‌కాండ్లీలో దుర్గంధం..

లోకేశ్వరం మండలం రాయపూర్‌కాండ్లీ సమీపంలో భైంసా–లోకేశ్వరం రహదారిపై బస్‌షెల్టర్‌ను 30 ఏళ్ల కిందట నిర్మించారు. ప్రస్తుతం బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరుకొని దుర్గంధభరితంగా మారింది. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పక్కనున్న పెట్రోల్ బంక్‌ల వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ప్రాంగణాన్ని శుభ్రం చేసినా దాఖలాలు లేవు. మరోవైపు లోకేశ్వరంలో పాతబస్‌షెల్టర్ సైతం వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది.

వాలేగాంలో..

భైంసా మండలంలోని వాలేగాంలో లోకేశ్వరం–భైంసాకు వెళ్లే రోడ్డు మార్గంలో నిర్మించిన బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రయాణికులు చెట్ల కింద, దుకాణాల ముందు బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇక్కడి ప్రయాణ ప్రాంగణం యాచకులు, శునకాలకు నిలయంగా మారింది.

మరుగుదొడ్లను నిర్మించాలి



రాయపూర్‌కాండ్లీ బస్‌షెల్టర్‌కు ప్రయాణికులు వచ్చిపోతుంటారు. మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించాలి.

– సుధాకర్, దేగాం

తాగునీటి సౌకర్యం కల్పించండి



ప్రయాణ ప్రాంగణంలో మంచి నీటి సౌకర్యం లేకపోవడంతో పక్కనున్న హోటల్‌కు వెళ్లి నీటిని తాగుతున్నాం. తాగునీరు, మరుగుదొడ్లను నిర్మించాలని అధికారులను కోరుతున్నాం.

– మరియా, రాయపూర్‌కాండ్లీ

సమస్యలు పరిష్కరిస్తాం

భైంసా డిపో పరిధిలోని బస్‌షెల్టర్లను రోజు శుభ్రం చేయిస్తాం. సబ్ షెల్టర్ల వద్ద తాగునీటి సౌకర్యం కల్పిస్తాం. పలు గ్రామాల్లో బస్‌షెల్టర్‌లు శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. ప్రయాణికులకు ఇబ్బంది కల్గకుండా ఉన్నతాధికారులకు నివేదించి వసతులు కల్పించేలా చూస్తాం.

– అమృత, భైంసా డిపో మేనేజర్

అటెన్షన్ ప్లీజ్ – భవనం పూర్తయ్యేది ఎప్పుడో?



తానూరు: మండలంలోని హిప్నెల్లి గ్రామంలో రూ.13 లక్షలతో చేపట్టిన పంచాయతీ కార్యాలయ నిర్మాణ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. ఐదేళ్ల కిందట పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ నిధులు రావడం లేదని వదిలేశారు. దీంతో శిథిలావస్థకు చేరిన పాత భవనంలోనే పంచాయతీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తూ ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేదలకు వైద్యం మరింత చేరువ

- దశాబ్ది వేడుకల్లో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: ప్రత్యేక రాష్ట్రంలో ప్రభుత్వం సర్కారు ఆస్పత్రులను అభివృద్ధి చేసి పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేసిందని ఎమ్మెల్యే జి విఠల్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో వైద్యారోగ్య దినోత్సవం నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు వైద్యసేవలు విస్తృతం చేయాలనే ఉద్దేశంతో బస్తీ, పల్లె దవాఖానాలు ఏర్పాటు చేసిందన్నారు. కేసీఆర్ కిట్‌తోపాటు న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నామన్నారు. సాధారణ ప్రసవాలకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. అనంతరం పలువురు వైద్యులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిజ్ ఘోరి, భైంసా ఏరియాస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, బీఆర్‌ఎస్ నాయకులు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యరంగంలో ప్రగతి సాధించాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్
- ఘనంగా వైద్యారోగ్య దినోత్సవం



ఖానాపూర్‌లో న్యూట్రిషన్ కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఖానాపూర్: సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఆరోగ్య రంగంలో గొప్ప ప్రగతి సాధించిందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాలులో వైద్యారోగ్య దినోత్సవం నిర్వహించగా వారు హాజరై మాట్లాడారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రతి జిల్లాకో వైద్యకళాశాల ఏర్పాటు చేశారన్నారు. పోషకాహార లోపం నివారించేందుకు న్యూట్రిషన్ కిట్, అంధత్వ నివారణకు కంటివెలుగు కార్యక్రమాలు ప్రారంభించారని పేర్కొన్నారు. గతంలో మూడుగా ఉన్న డయాలసిస్ కేంద్రాల సంఖ్య 104కు పెంచామన్నారు. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, పుప్పాల శంకర్, శ్రీరాంనాయక్, కేహెచ్‌ఖాన్, రాజిరెడ్డి, గజేందర్, నాగేశ్, అధికారులు రవీందర్ రెడ్డి, నయనరెడ్డి తదితరులు ఉన్నారు.

భూమిపూజ

ఖానాపూర్ పట్టణంలోని ఖానాపూర్ మహాలక్ష్మి ఆలయ నిర్మాణ పనులు, సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే రేఖానాయక్ భూమిపూజ చేశారు. అంతకుముందు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ ఇన్‌చార్జి శోభన్‌ను పరామర్శించారు. అనంతరం పెంబి మండలానికి చెందిన ఆర్టీసీ విశ్రాంత మేనేజర్ లక్ష్మణ్, పలువురు ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అంకం రాజేందర్, పుప్పాల శంకర్, జన్నారపు శంకర్, ఎలిశెట్టి లింగేశ్వర్, సతీశ్‌రావు, పంబాల భీమేశ్వర్, రవిచరణ్, రాజేశ్వర్, శ్రీనివాస్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి కుటుంబీకులు

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకలను ఈనెల2 నుంచి ఘనంగా నిర్వహిస్తోంది. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. కానీ వేడుకలు నిర్వహించే కార్యక్రమాల వేదికపై మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి కుటుంబీకులు కనిపించడం చర్చకు తావిస్తోంది. భైంసాలో మంగళవారం తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం సందర్భంగా, బుధవారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో.. ఒకరిద్దరు మాత్రమే మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మరికొందరు మహిళా ప్రజాప్రతినిధుల స్థానంలో వారి కుటుంబీకులు వేదికపై పాల్గొంటున్నారు. అంతేకాక అధికారులు సైతం మహిళా ప్రజాప్రతినిధుల పేర్లకు బదులు వారి కుటుంబీకుల పేర్లతో వేదికపైకి ఆహ్వానించడం గమనార్హం.

పాఠశాలల్లో అక్షరాభ్యాసాలు



పరిమండల్‌లో విద్యార్థులు,ఉపాధ్యాయులు



కన్నపూర్‌లో అక్షరాలు దిద్దిస్తున్న సర్పంచ్ నరేశ్

మామడ: మండలంలోని అన్ని పాఠశాలలలో బుధవారం సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. పుస్తకాలు, యూనిఫాంలను విద్యార్థులకు అందించారు. పరిమండల్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు గంగన్న, ప్రమోద్‌రాం, సరిత, పద్మజ అంగన్‌వాడీ టీచర్ ప్రసాద పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు బుధవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. హెచ్‌ఎం ఎల్లన్న, ఉపాధ్యాయురాలు ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని కన్నపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం సర్పంచ్ సలాయి నరేష్ చేయించారు. ప్రధానోపాధ్యాయుడు రమేశ్, అంగన్‌వాడీ టీచర్ ప్రభ ఉన్నారు.

కడెం: బడిబాటలో భాగంగా మండలంలోని లింగాపూర్‌ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఒకటో తరగతి విద్యార్థులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతిదేవి చిత్రపటానికి పూజలు నిర్వహించి, చిన్నారులచే అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవితాదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రణయశీల, గంగారాం తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

కార్యవర్గాల ప్రమాణ స్వీకారం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీ వాసవిమాత ఆలయ ఆవరణలో ఖానాపూర్ వాసవిక్లబ్, వనిత క్లబ్‌ల నూతన కార్యవర్గాల ప్రమాణస్వీకారోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ అధ్యక్షుడిగా ముక్క కిషన్, ప్రధాన కార్యదర్శిగా సామ లక్ష్మినారాయణ, కోశాధికారిగా చిటికేశి సతీష్, వనిత క్లబ్ అధ్యక్షురాలిగా చిటికేశి మానస, ప్రధాన కార్యదర్శిగా స్రవంతి, కోశాధికారిగా వరలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎలిమిల్ల మనోజ్, వల్లపుశెట్టి శ్రీనివాస్, బోంపల్లి రాజు, జితేందర్, రామకృష్ణ, సోను, నరేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

ఖానాపూర్: ప్రభుత్వ వైఫల్యం కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజన శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధార్థనాయక్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఘటనకు నైతిక బాధ్యతగా డైరెక్టర్‌తో పాటు వీసీలను పదవుల నుంచి తొలగించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే బాధితుల తరఫున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

పరామర్శ

సారంగపూర్: మండలంలోని ధని గ్రామంలో గొల్ల లక్ష్మి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. సారంగపూర్‌లో ఉపసర్పంచ్ దేవిముత్యం తండ్రి, దుప్యాతండా సర్పంచ్ ప్రహ్లాద్ సోదరుడు ఇటీవల మరణించారు. బాధిత కుటుంబసభ్యులను మంత్రి పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాధవరావు, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సారెడ్డి, గంగారెడ్డి, మాణిక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మంత్రి పరామర్శ

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామ ఉపసర్పంచ్ రమేశ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులను బుధవారం వారి ఇంటి వద్ద మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. వారి వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి, అల్లోల సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మండలాధ్యక్షుడు క్రిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.

సన్మానం

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన బేడబుడగజంగ సంఘం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు భూక్యా జాన్సన్‌ను బుధవారం సన్మానించారు. అనంతరం గోడలపంపు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నాగుల శంకర్ గౌడ్ వారిని కలిసి పలు విషయాలపై చర్చించారు. సంఘం సభ్యులు, నాయకులు ఉన్నారు.

శిఖం భూమిలో నిర్మాణం వద్దని వినతి

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని చెరువు శిఖం భూమిలో ఆలయ నిర్మాణ పనులు చేపట్టవద్దని కోరుతూ అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్ రాజు తహసీల్దార్ కవితారెడ్డికి వినతి పత్రం అందచేశారు. బుధవారం మండల కేంద్రంలో వీడీసీ ఆధ్వర్యంలో రామాలయం నిర్మాణ పనులకు చెరువు శిఖం భూమిలో పూజ చేశారు. చెరువు భూమిపై సర్వే చేయించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన నేతలు

లక్ష్మణచాంద: మండలంలోని పలువురు బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. లక్ష్మణచాందకు చెందిన ఈటెల శ్రీనివాస్, నాయకులు అట్ల రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమ విద్యార్థి నాయకుడు బ్రహ్మదండి సురేష్ బుధవారం కూచాడి శ్రీహరిరావు నేతృత్వంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు.

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు అబ్దుల్ హాదీ బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఉద్యమ బాటలో పయనించిన వారిని పక్కన పెట్టడంతోనే శ్రీహరిరావుతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.

మోనూ ప్రకారం భోజనం అందించాలి



సరుకులు అందిస్తున్న సూపర్‌వైజర్ శ్రీలత

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మోనూ ప్రకారం భోజనం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. బుధవారం మండలంలోని దిలావర్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పలువురికి బాలామృతం, కోడిగుడ్లు సూపర్‌వైజర్ పంపిణీ చేశారు. కేంద్రంలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయలు సాగు చేయాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులు కేంద్రాలకు వచ్చేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని కోరారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



కారేగాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముధోల్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కారేగాం గ్రామంలో రూ.30లక్షలతో నిర్మించిన శ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ రాజేశ్ బాబు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, వైస్‌ఎంపీపీ రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, సర్పంచ్ నర్సారెడ్డి, ఎంపీటీసీలు జ్యోతి దేవన్న, సరళ, సురేందర్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. సర్పంచ్ ముత్యం, రత్నాకర్, రాజేశ్వర్ ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని సేవాలాల్‌తండా శ్రీజగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్, రామ్‌రావ్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రూ.22 లక్షల సీజీఎఫ్ నిధులతో ఆలయం నిర్మించామన్నారు. బాబుసింగ్ మహారాజ్, ధర్మగురు బంజార సమాజ్ పొరదేవి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్ బాబు, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, శ్యాంసుందర్, సర్పంచ్ యశోదబాయి తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామంలో రూ.24 లక్షలతో నిర్మించే శ్రీ హనుమాన్ ఆలయ కల్యాణ మండపానికి బుధవారం ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అశ్విని, జెడ్పీటీసీ చిన్నరామయ్య, ఎంపీటీసీ నర్సమ్మ, ఉపసర్పంచ్ లక్ష్మణ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేష్, రాజేశ్వర్, ప్రవీణ్ పాటిల్, గంగారెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కల్లూర్‌లో కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్ గజ్జారాం

కుంటాల: మండలంలోని కల్లూర్ రైతువేదికలో బుధవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం ప్రారంభించారు. క్వింటాలుకు రూ.2960 ధర నిర్ణయించినట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మబాయి, డీసీజీబీ డైరెక్టర్ వెంకటేశ్, సొసైటీ డైరెక్టర్ పురుషోత్తం, లక్ష్మణ్‌పటేల్, రమణాగౌడ్, పెంట దశరథ్, సునీల్‌రెడ్డి, రజినీకాంత్, కిష్టయ్య, మురళి, సంతోశ్, ముత్యం, రమేశ్, ఏఈవో గణేశ్ ఉన్నారు.


సారంగపూర్‌లో

సారంగపూర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ కౌట్ల(బి) చైర్మన్ అయిర నారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. శ్రీనివాస్‌రెడ్డి, దేవిశంకర్, మాధవరావు, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆవాసం విద్యార్థులకు దుస్తులు అందజేత

భైంసాటౌన్: పట్టణంలోని గోకుల్‌నగర్ వివేకానంద ఆవాసం విద్యార్థులకు దాతలు దుస్తులు అందజేశారు. బుధవారం నిర్మల్‌కు చెందిన హేమలత –జయదేవ్ దంపతులు గంగారపు లక్ష్మి(హేమలత తల్లి) జ్ఞాపకార్థం దాదాపు 30 మంది విద్యార్థులకు సరిపడ దుస్తులు అందజేశారు. ఈసందర్భంగా ఆవాసం ప్రముఖ్ లింగారెడ్డి, కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ

సారంగపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం పల్లె ప్రగతి దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ సరోజ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు పతాని రాధ, పంచాయతీరాజ్ ఏఈ శరత్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం నిర్వహించే పల్లె ప్రగతి దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీవో రహీమ్ పేర్కొన్నారు.